

కులగణన హర్షణీయం

రాష్ట్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేయడం హర్షణీయమని బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు అన్నారు. - 8లో..



డీజీ పేటలో చోరీ

సీఎస్‌పురం మండలం డీజీపేటలో చోరీ జరిగింది. రూ.1.20 లక్షల నగదు, 50 గ్రాముల బంగారం, 140 గ్రాముల వెండి చోరీకి గురైంది. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
32.1/24.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు విద్యార్థులకు పోటీలు

ఒంగోలు: ఖాదీ మహోత్సవ్‌లో భాగంగా జిల్లా స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో విజేతలైన వారికి ఈనెల 14న స్థానిక సెయింట్ థెరెస్సా స్కూలు ఆవరణలో ఉదయం 9.30 గంటలకు పోటీలు నిర్వహిస్తారన్నారు. మండల విద్యాశాఖ అధికారులు మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రథమ విజేతను జిల్లా స్థాయి పోటీలకు పంపాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ వెంట రైటింగ్ ప్యాడ్లు తెచ్చుకోవాలన్నారు.

బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షురాలిగా శేషమ్మ



కేవీ శేషమ్మకు నియామక పత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు బలగాని ఆంజనేయులు

ఒంగోలు: ఏపీ బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షురాలిగా కేవీ శేషమ్మ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పంపిన నియామక పత్రాన్ని స్థానికంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బలగాని ఆంజనేయులు, గౌరవాధ్యక్షుడు గోనుగుంట్ల బ్రహ్మానందశర్మ అందించారు. ఈ సందర్భంగా ఆమెకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, జిల్లా జంగం సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పావల్ల రాసయ్య, 50వ డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, మూడో క్లస్టర్ ఇన్‌చార్జి బొమ్మినేని మురళి, శ్రీవిశ్వ వికాస భారతి సేవా సంస్థ, వెంకటేశ్వర కాలనీ వాసులు పలువురు అభినందనలు తెలిపారు.

ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా షేక్ ఖాసిం వలి




షేక్ ఖాసిం వలి

ఒంగోలు సెంట్రల్: ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘ నూతన అధ్యక్షుడిగా షేక్ ఖాసిం వలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒంగోలు ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించారు. మద్రిపూడి మండలం తంగెళ్ల గ్రామానికి చెందిన షేక్ ఖాశిం వలి సంఘ సంక్షేమం కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన ఖాసిం వలికి పలువురు అభినందనలు తెలిపారు. త్వరలోనే అభినందన సభను నిర్వహిస్తారని, ఈ కార్యక్రమానికి దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని మైనార్టీ సంఘ నాయకులు షేక్ వలి, మహమ్మద్ బాషా తెలిపారు.

క్రీడలపై ఆసక్తి పెంచండి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: తల్లిదండ్రులు విద్యార్థి దశ నుంచే తమ పిల్లలకు క్రీడలపై ఆసక్తిని పెంచేలా కృషి చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా వికాస కేంద్రంలో ఆది, సోమవారాల్లో మార్కాపూర్ స్పోర్ట్స్ అండ్ యోగా క్లబ్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి బాలబాలికల అండర్ 15 షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వలన శారీరక, మానసిక వికాసం కలుగుతుందని, విద్యార్థుల మధ్య ఐక్యత వస్తుందన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 24 టీముల్లో బాలికలు, 118 టీముల్లో బాలురు పాల్గొన్నట్లు క్లబ్ అధ్యక్షుడు బీ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో షకీల్, నర్సింహ నాయక్, ద్వితీయ విజేతలుగా అభి, హర్ష, మూడో విజేతలుగా ఫిరోజ్, ఫణి గెలుపొందారు. బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో త్రిభువన శ్రీ, లక్ష్మీ మేఘన, ద్వితీయ స్థానంలో కీర్తి, హాసిని, తృతీయ స్థానంలో సుస్మిత, హర్షిణిలు గెలుపొందినట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు అందించారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, ఎంఈఓలు రాందాస్‌నాయక్, టి. శ్రీనివాసరావు, అధ్యక్షుడు అమీర్ బాషా, నిర్వాహకులు టి సత్యం, గుంటక సుబ్బారెడ్డి, కుందురు శ్రీనివాసరెడ్డి, బీ కాశయ్య, నాగేశ్వరరావు, ఆంజనేయులు, చాంద్‌బాషా, అమర్నాథ్, అర్జున్, కౌన్సిలర్ బుస్సెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు.

ప్రమాదంలో పులి



రెండు రోజుల క్రితం శ్రీశైలం ఘాట్‌రోడ్డులో చనిపోయిన చిరుతపులి

నల్లమల అటవీప్రాంతంలో పులులు ప్రమాదంలో పడ్డాయి. వివిధ కారణాలతో తరచూ మృతి చెందుతున్నాయి. రోడ్డు దాటుతుండగా ఒకటి.. బావిలో పడి మరొకటి.. రైలు పట్టాలపై ఇంకొకటి.. ఇలా మృత్యువాత పడటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. పులుల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ అవి రోడ్లపైకి వచ్చి ప్రమాదంలో పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పులుల సంరక్షణపై అటవీశాఖ అధికారులు దృష్టి సారించారు.



- నల్లమల అభయారణ్యం నుంచి జనారణ్యం వైపు
- రోడ్డు ప్రమాదాల్లో పులులు మృతి
- పులుల రక్షణకు ప్రత్యేక చర్యలు

మార్కాపురం: ప్రకాశం, గుంటూరు, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 3,568 చదరపు కిలోమీటర్ల మేర నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. సువిశాల విస్తీర్ణంలో నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్ట్ ఉంది. దేశంలోనే అతిపెద్దదిగా పేరుగాంచింది. ఈ ప్రాంతంలో 73 పెద్ద పులులు, 100కిపైగా చిరుత పులులు ఉన్నాయని అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. ప్రతి నాలుగేళ్లకోసారి పులుల సంఖ్యను అధికారికంగా లెక్కిస్తారు. నాలుగేళ్ల కిందట నల్లమలలో 40 నుంచి 48 పెద్ద పులులు ఉండగా, ఈ సంఖ్య ప్రస్తుతం 73కి చేరింది. ఇక చిరుత పులులు 100కిపైగా ఉన్నాయి. వీటితో పాటు అరుదైన అలుగు, వేల సంఖ్యలో జింకలు, దుప్పులు, నెమళ్లు, రేచుకుక్కలు, ముళ్ల పంది, ఈలుగ, ఎలుగుబంట్లు ఉన్నాయి.

పులులు అడవి జంతువులను వేటాడుతూ జీవిస్తుంటాయి. వేటాడే క్రమంలోనూ, నీటి కోసం రోడ్లపైకి వస్తూ పెద్దపులులు, చిరుతలు మృత్యువాతపడుతున్నాయి. జిల్లాలోని నల్లమల సమీప గ్రామాలవైపు తరచూ పులులు వచ్చి వెళ్లినట్టు వాటి పాదముద్రల ఆధారంగా అధికారులు గుర్తించారు. ఇవి అభయారణ్యం దాటి రాకుండా చర్యలు తీసుకుంటున్నప్పటికీ రోడ్లపైకి వచ్చి మృతి చెందుతున్నాయి. దీనిపై వణ్యప్రాణి ప్రేమికులు, సంరక్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పులుల రక్షణకు ప్రత్యేక చర్యలు...

నల్లమల అభయారణ్యాన్ని కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ టైగర్ రిజర్వు ఫారెస్ట్ (రాజీవ్ అభయారణ్యం)గా ప్రకటించింది. దీని వలన దోర్నాల - శ్రీశైలం, శ్రీశైలం - తెలంగాణ రాష్ట్రంలోని అమ్రాబాద్ మధ్య అటవీశాఖ గేట్లను ఏర్పాటు చేసి రాత్రి 9 నుంచి ఉదయం 5 గంటల వరకు పులుల సంచారం ఉంటున్నందున రాకపోకలను నిలిపివేసింది. వేటగాళ్ల నుంచి పులులను కాపాడేందుకు నల్లమలలో 24 బేస్ క్యాంప్‌లు ఉన్నాయి. మొత్తం 120 మంది టైగర్ ట్రాకర్లు విధుల్లో ఉంటారు. ఒక్కొక్క బేస్ క్యాంప్‌లో 5 మంది సభ్యులుంటారు. వీరు కాక 2 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది అడవిలో తిరుగుతుంటారు. ఇదిలా ఉండగా మగపులి దాదాపు ఐదారు కిలోమీటర్ల మేర తన సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటుంది. ఆ ప్రాంతంలో ఎలాంటి వన్యప్రాణి సంచరించే పరిస్థితి ఉండదు. ఒక వేళ వస్తే అది దానికి ఆహారం కావాల్సిందే.



సాసర్‌పిట్‌లో నీళ్లు తాగుతున్న పెద్దపులులు

పెద్దపులులు: 73
చిరుతలు: 100

నల్లమలలో పులుల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పులులతో పాటు ఇతర జంతువులకు తాగునీటి సమస్య లేకుండా చాలా ప్రాంతాల్లో సాసర్ పిట్లు ఏర్పాటు చేశారు. పులులు సంచరించే ప్రాంతాల్లో కెమేరాలు బిగించారు. 24 గంటలు బేస్‌క్యాంప్ సిబ్బంది పులుల సంరక్షణపై దృష్టి పెట్టారు. అడవుల్లోకి ఎవరు వచ్చినా తెలిసే విధంగా ఏర్పాట్లు చేశారు. నిబంధనలు అతిక్రమించి జంతువులపై దాడులకు పాల్పడితే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తున్నారు. గిద్దలూరు - నంద్యాల మధ్య ఉన్న రైల్వే ట్రాక్ ప్రాంతాల్లో కొన్ని చోట్ల రైళ్ల వేగాన్ని సైతం తగ్గించాలని అక్కడి అధికారులు ప్రతిపాదనలు పంపారు. దీంతో పాటు అండర్ పాస్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని నివేదికలను ఉన్నతాధికారులకు పంపారు.

చనిపోవడానికి కారణాలు...


తరచూ జంతువులను వేటాడుతూ అడవి నుంచి రోడ్లపైకి, రైల్వే ట్రాక్‌ల పైకి వచ్చి ప్రమాదవశాత్తూ వాహనాలు తగిలి చనిపోతున్నాయి. అటవీ ప్రాంతంలో నీటి వనరులను అందుబాటులో ఉంచినా నీటి కోసం జనారణ్యంలోకి వచ్చే క్రమంలో రోడ్డు దాటుతూ మృత్యువాతపడుతున్నాయి.

- 2023 నవంబరు 10న శ్రీశైలం ఘాట్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత అక్కడికక్కడే మరణించింది. ఇదే సంవత్సరంలో ఒకటిన్నర సంవత్సరం వయసున్న చిరుతపులి పిల్ల రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందింది.
- 2022 జనవరి 6న దోర్నాల మండలం రోళ్లపెంట సమీపంలో బావిలో పడి చిరుత పులి మృతి చెందింది.
- 2021 నవంబర్ 12న గిద్దలూరు- నంద్యాల మధ్య చలమ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ దాటుతూ ప్రమాదవశాత్తూ రైలు కింద పడి పెద్ద పులి మృతి చెందింది.
- 2020 ఏప్రిల్ నెలలో యర్రగొండపాలెం సమీపంలోని గాలికొండ అటవీ ప్రాంతంలో వృద్ధాప్యంతో తీవ్రమైన ఎండవేడిని తట్టుకోలేక పెద్ద పులి మృతి చెందింది.

పుల్లలచెరువుకు వరికెపూడిసెల ఒక వరం



ప్రాజెక్టుపై ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్ (ఫైల్)



ప్రాజెక్టు స్వరూపం మ్యాప్

- 15న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాచర్లలో శంకుస్థాపన
- వెల్లడించిన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: పుల్లలచెరువు మండల ప్రజలకు వరికెపూడిసెల ప్రాజెక్టు ఒక వరం అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు వలన మండలంలో నెలకొన్న కరువు కాటకాలకు స్వస్తి పలికే రోజులు దగ్గరపడుతున్నాయని, తాగు, సాగు నీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందని అన్నారు. ఈ నెల 15వ తేదీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాచర్లలో వరికెపూడిసెల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. పల్నాడు జిల్లాలో వరికెపూడిసెల ప్రాజెక్టు ద్వారా రెండు ఫేజ్‌లలో మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, గురజాల, బొల్లాపల్లి మండలాలకు సాగు నీరు అందేలా ఇంజినీరింగ్ నిపుణులు రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే నీరు పుల్లలచెరువు మండలంలోని కొన్ని గ్రామాలకు కూడా అందించవచ్చని గ్రామస్తుల సూచన మేరకు మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పుల్లలచెరువు మండలంలోని శతకోడు, ముటుకుల, మర్రివేములను ఆ ప్రాజెక్టులో చేర్చారు. దీని ద్వారా ఆయా గ్రామాల్లో మొత్తం 9,743 ఎకరాలకు సాగునీరు అందించేలా అధికారులు రూపకల్పన చేశారు. పుల్లలచెరువు మండలంలో భూగర్భ జలాలు అడుగంటడం వలన ఏటా తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి సంబంధిత అధికారులకు వివరించారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని శతకోడు, ముటుకుల, మర్రివేముల గ్రామాల్లోని చెరువులను ప్రాజెక్టు నీటిని నింపడం వలన దాదాపు 14 గ్రామాలకు తాగునీరు అందుతుందని, ఈ మేరకు ప్రణాళికలు రూపొందించాలని, ఈ అంచనా వ్యయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని ఆయన అధికారులకు సూచించారు. ఫస్ట్ ఫేజ్ కింద కేవలం 24,900 ఎకరాలు మాత్రమే సాగునీరు అందనుంది, రెండో ఫేజ్‌లో ఒక లక్ష 5 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. మండలానికి తీగలేరు కాలువ ద్వారా పుల్లలచెరువులోని చిన్న కండలేరు వరకు వెలిగొండ ప్రాజెక్టు నీరు రావడం వలన 11 వేల ఎకరాలకు పైగా సాగు నీరు అందుతుందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకుంటున్న వరికెపూడిసెల ప్రాజెక్టు ద్వారా 10 వేల ఎకరాలకు పైగా సాగు, తాగు నీరు అందనుందని ఆయన వివరించారు. ఈ రెండు పనులు చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ఈ పనులు పూర్తయితే మండలం సస్యశ్యామలంగా మారుతుందని తెలిపారు.

మార్కాపురం కీర్తి ప్రతిష్ఠలు పెంచాలి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



కరాటే క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: క్రీడాకారులు మార్కాపురం కీర్తి ప్రతిష్ఠలు పెంచాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆకాంక్షించారు. మన్యంజిల్లా పార్వతీపురం గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాల, కాలేజీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి 67వ స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో మార్కాపురం నుంచి నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో గెలుపొంది జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఎమ్ ఎస్ స్పోర్ట్స్ కరాటే సీనియర్ ఇన్‌స్పెక్టర్ తోట ప్రసాద్ ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. జాతీయ స్థాయిలో మార్కాపురానికి మంచిపేరును తేవాలని సూచించారు. ఈనెల 9 నుంచి 11 వరకూ ఈ పోటీలు జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. పీ సాయివెంకట శివ 70 కిలోల విభాగంలో బంగారు పతకం, ఎస్ జస్వంతరెడ్డి, చరణ్‌కుమార్ 50 కిలోల విభాగంలో బహుమతులు సాధించారు. అండర్ 14 విభాగంలో ఎస్‌కే షాకీర్ బాషా, ముష్కన్ 26 కిలోల విభాగంలో సాయి త్రిష బహుమతులు సాధించినట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, కరాటే ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాసరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య తదితరులు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి కాకినాడ జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ క్రీడా పోటీలు



సిద్ధమైన రైజ్ కాలేజీ క్రీడా ప్రాంగణం

ఒంగోలు: స్థానిక రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ పోటీలకు సిద్ధమైంది. ఈనెల 14, 15 తేదీల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మీట్‌కు సంబంధించిన అన్ని రకాల కార్యక్రమాలను పూర్తి చేసినట్లు కళాశాలల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. ఈ పోటీలకు యూనివర్శిటీ పరిధిలోని 40 కాలేజీల నుంచి 50కిపైగా టీములు పాల్గొనేందుకు ఉత్సాహాన్ని కనబరిచాయని, వారందరికీ వసతి సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశామని డైరెక్టర్ ఏవీ భాస్కరరావు తెలిపారు. ఈ మీట్‌కు వచ్చే వారికి రైల్వేస్టేషన్, బస్టాండు నుంచి రైజ్ కాలేజీ వరకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారని, దూర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు కాలేజీలోనే వసతి ఏర్పాటు చేసినట్లు గౌరవ చైర్మన్ ఇస్కాల చిన రంగమన్నార్ తెలిపారు. యూనివర్శిటీ మీట్‌లో బాలబాలికల విభాగాలకు చెస్, టెన్నిస్ జరుపుతామని, బాలికలకు ప్రత్యేకంగా కబడ్డీ పోటీలు నిర్వహిస్తారన్నారు. మొత్తం 500 మంది క్రీడాకారులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఫిజికల్ డైరెక్టర్లు ఎస్.హిమచంద్రబాబు, ఎన్.సుబ్బారావు, కోఆర్డినేటర్ కె.వీరాంజనేయులు తెలిపారు.

రాజకీయ ఎదుగుదల అడ్డుకునేందుకే కబ్జా ఆరోపణలు

- ఒకరికి సాయం చేసే మనస్తత్వం మా కుటుంబానిది
- రాజకీయంగా, వ్యక్తులపరంగా నష్టపోయానే తప్ప లాభపడింది లేదు
- అసలు కబ్జాలు, నకిలీ డాక్యుమెంట్ల వ్యవహారంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిందే నేను
- విలేకరుల సమావేశంలో మేయర్ గంగాడ సుజాత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: రాజకీయంగా ఎదుగుదలను చూసి ఓర్వలేక అడ్డుకోవటానికే తన పై భూ కబ్జా ఆరోపణలు చేస్తున్నారని, అందుకు కొందరు మీడియా వ్యక్తులను అడ్డం పెట్టుకొని తనను మానసికంగా కుంగదీసేందుకు యత్నిస్తున్నారని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత ధ్వజమెత్తారు. ఈ మేరకు స్థానిక సంతపేటలోని మేయర్ నివాసంలో సోమవారం పలువురు ఒంగోలు కార్పొరేటర్లతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో మాట్లాడుతూ త్రోవగుంట సమీపంలోని మండువారిపాలెం గ్రామ పరిధిలో తాను, తన భర్త కలిసి 14 ఎకరాలు కబ్జా చేశామని, ఆ భూమి విలువ దాదాపు రూ.50 కోట్లు ఉంటుందని కొన్ని మీడియా సంస్థల్లో కథనాలు ప్రసారం చేశారన్నారు. ఆ కథనాలు పచ్చి అవాస్తవాలు, అసత్య కథనాలని మేయర్ కొట్టిపారేశారు. త్రోవగుంట సమీపంలోని మండువారిపాలెంలోని కొందరు వ్యక్తులు వచ్చి తమ పొలాలను ఆక్రమించుకున్నారని, కనీసం కౌలు కూడా ఇవ్వటం లేదని తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. వారికి న్యాయం చేద్దామని, ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులతో మాట్లాడి, రికార్డులు పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించానన్నారు. దానిని కొందరు తనపై కుట్రపన్ని కబ్జా ఆరోపణలకు తెరలేపారని మేయర్ ఆవేదన వ్యక్తం చేశారు. మండువారిపాలెంలో భూములను కొందరు కమ్మ కులానికి చెందిన వారు ఆక్రమించుకున్నారని మండిపడ్డారు. వారిని ప్రశ్నించేసరికి దానిని తనమీదకు రుద్దే కుయుక్తులు పన్నారని ధ్వజమెత్తారు. అక్కడే ఇరిగేషన్ కాలువకు చెందిన భూములను బీఎంఆర్ వాళ్లు ఆక్రమించారని, మరి అలాంటి వారి మీద మాత్రం రాయరని నిలదీశారు. అంటే వాళ్లు అగ్రవర్ణాలు అనేనా అని ప్రశ్నించారు. తాను ఒక దళిత మహిళను అనా లేక బయట నుంచి వచ్చానని తన మీద రాస్తున్నారా అని ప్రశ్నించారు. బాలినేని శ్రీనివాస రెడ్డి దయతో ఒంగోలు నగర మేయర్‌ని అయ్యానన్నారు. అసలు భూ కబ్జాలు, నకిలీ డాక్యుమెంట్ల వ్యవహారాన్ని తొలుత కలెక్టర్‌కు తాను, వైఎస్సార్‌సీపీ నాయకులు చుండూరు రవితో కలిసి ఫిర్యాదు చేశామన్నారు. అలాంటిది తనపై కబ్జా ఆరోపణలు చేసి తన రాజకీయ జీవితాన్ని నాశనం చేయాలని, రాజకీయంగా ఎదగనీయకుండా చేయాలని కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. తనది, తన భర్తది కష్టపడే మనస్తత్వమని, పది మందికి సాయం చేస్తే తత్వమే కానీ, ఒకరినుంచి లాక్కుందామని ఏనాడూ భావించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా, వ్యక్తుల పరంగా నష్టపోయామే కానీ లాభపడింది లేదన్నారు. మీడియా వాళ్లు లేనిపోని ఆరోపణలు చేసి తన రాజకీయ జీవితాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ ఆస్తులను కాపాడే పనిలో నిమగ్నమయ్యామన్నారు. సమావేశంలో కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య మాట్లాడుతూ నిందారోపణలు చేయటం మానుకోవాలని హితవు పలికారు. రైతుల పొలాలను ఇతరులు అన్యాక్రాంతం చేస్తే ఆ విషయాన్ని వాళ్లు మేయర్ దృష్టికి తీసుకొస్తే వాటిపై కూడా ఇలాంటి నిందలు వేస్తారా అని ప్రశ్నించారు. అలాంటప్పుడు మేయర్ వివరణ కూడా తీసుకోవాలి కదా అన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు చింతపల్లి గోపీచంద్, తాడి కృష్ణలత, వైఎస్సార్‌సీపీ నాయకురాలు చింతగుంట్ల సువర్ణ పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో ప్రదీప్‌కు 20వ ర్యాంకు



తల్లిదండ్రులతో డాక్టర్ ప్రదీప్ సుందర్‌రెడ్డి

ఒంగోలు టౌన్: ఢిల్లీ ఎయిమ్స్ నిర్వహించిన ఐఎన్ఐసెట్ పీజీ పరీక్షల్లో ఒంగోలుకు చెందిన ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ మధుకిరణ్ రెడ్డి కుమారుడైన డా.ప్రదీప్ సుందర్ రెడ్డి ఆలిండియా స్థాయిలో 20వ ర్యాంకు సాధించారు. ప్రదీప్ పాండిచ్చేరి జిప్మర్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. తండ్రి ఒంగోలులో కిరణ్ న్యూరో అండ్ ఆర్థో సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్వహిస్తున్నారు. తల్లి డాక్టర్ జి.భగీరథ దేవి జిల్లా మెడికల్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో 20వ ర్యాంకు సాధించడం ఎంతో ఆనందంగా ఉందని ప్రదీప్ తెలిపారు. చండీఘర్‌లో జనరల్ మెడిసిన్ పీజీ చేయాలని ఉందన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లనే తాను పీజీలో జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించగలిగానని ప్రదీప్ తెలిపారు. జాతీయ స్థాయిలో 20వ ర్యాంకు సాధించిన ప్రదీప్‌కు పట్టణానికి చెందిన వైద్యులు, కిరణ్ న్యూరో అండ్ ఆర్థో సూపర్ స్పెషాలిటీ వైద్యశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

మార్కాపురం: ఈనెల 6వ తేదీన మార్కాపురానికి వచ్చిన తన భర్త కనిపించడంలేదని భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. నంద్యాల ఎన్‌జీఓ కాలనీలో నివాసముంటున్న సిరివెళ్ల వెంకటేశ్వర్లు మార్కాపురం ప్రాంతంలో వ్యాపార కార్యక్రమాలు నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల 6వతేదీన తన భర్త మార్కాపురానికి వచ్చి మళ్లీ కనిపించలేదని భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.





కులగణన హర్షించదగిన విషయం

- జీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు

ఒంగోలు సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం జన గణనతో పాటు కుల గణన కూడా చేయడం హర్షించదగిన విషయమని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు అన్నారు. ఒంగోలులోని యాదవ జేఏసీ కార్యాలయంలో సోమవారం 139 బీసీ కులాల జేఏసీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మిరియం శ్రీనివాసులు మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో బీసీలు ఆరు ఎమ్మెల్యే స్థానాల్లో, ఒక ఎంపీ స్థానంలో పోటీచేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు అవకాశం కల్పించే విధంగా ఒత్తిడి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ఎంత రిజర్వేషన్ అనే విషయంపై స్పష్టత లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అయితే బీసీల రాజ్యాధికారం కోసం పాటుపడుతుందో ఆ పార్టీకి మద్దతిచ్చే విధంగా ఐకమత్యంగా ఉండాలని కోరారు. బీసీలు అనుసరించాల్సిన విధానంపై చర్చించారు. బీసీలు ఆయా స్థానాలకు పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు తన్నీరు రమణమ్మ, గోపి కృష్ణనాయుడు, ఏడుకొండలు, కృష్ణయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మిరియం శ్రీనివాసులు

19న ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ వార్షికోత్సవం

ఒంగోలు అర్బన్: ఈ నెల 19వ తేదీ విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ రెండో వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని అసోసియేషన్ నాయకులు, సభ్యులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు కోరారు. సోమవారం ఒంగోలులోని అసోసియేషన్ కార్యాలయంలో వార్షికోత్సవ బ్రోచర్‌ను విడుదల చేశారు. దీనిలో ఉపాధ్యక్షులు హజీరాబేగం, ఇతర సభ్యులు రాజ్‌కుమార్, నరసయ్య, లిథియా, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు

రేపు హ్యాండ్‌బాల్ జిల్లా బాలికల జట్టు ఎంపిక

ఒంగోలు: హ్యాండ్‌బాల్ జిల్లా జూనియర్ బాలికల జట్టును ఈ నెల 15వ తేదీ ఎంపిక చేయనున్నట్లు ప్రకాశం జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జె.నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిక జరుగుతుందన్నారు. 2004 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులని, ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 96667 02555 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యాదీవెన కోసం జాయింట్ అకౌంట్ తెరవాలి

- జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్

ఒంగోలు టౌన్: నాలుగో విడత జగనన్న విద్యాదీవెన నగదును ఈ నెల 28వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నారని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి ఎస్.లక్ష్మానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న విద్యాదీవెన పథకం అమలులో తల్లితో పాటుగా విద్యార్థికి కూడా భాగస్వామ్యం కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం నూతన విధానాన్ని రూపొందించిందని చెప్పారు. తదుపరి 4వ విడత ఫీజును తల్లి, విద్యార్థి పేరుతో తీసిన కొత్త జాయింట్ అకౌంట్‌కు జమ చేయనుందన్నారు. ఇందు కోసం ప్రభుత్వం పలు సూచనలు చేసిందని వివరించారు. నూతన విధానం ప్రకారం షెడ్యూల్డ్ కులాల విద్యార్థులంతా డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మినహాయించి మిగిలిన అన్ని కేటగిరీల వారు మూడు రోజుల్లోగా కొత్తగా జాయింట్ అకౌంట్ తెరవాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న నగదు నేరుగా కొత్త జాయింట్ అకౌంట్‌కు మాత్రమే జమవుతుందని తెలిపారు. ఇందుకోసం ఏదైనా బ్యాంకులో విద్యార్థి ప్రాథమిక ఖాతాదారుగా, తల్లి ద్వితీయ ఖాతాదారుగా కొత్తగా జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయాలని చెప్పారు. సంబంధిత సచివాలయంలో ఖాతా వివరాలను సమర్పించాలని సూచించారు. మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, గుర్తింపు, చిరునామా కోసం విద్యార్థి, తల్లి ఆధార్ కార్డులు, ఆధార్ కార్డులో పుట్టిన తేదీ వివరాలు లేకపోతే జనన ధ్రువీకరణ పత్రంగానీ, స్టడీ సర్టిఫికెట్‌గానీ సమర్పించాలని వివరించారు. కళాశాల విడుదల చేసిన విద్యార్థి గుర్తింపు కార్డు సమర్పించాలని తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలి

- గోడ పత్రిక ఆవిష్కరించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుశీల

త్రిపురాంతకం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రాచగొర్ల సుశీల వెంకట పిచ్చయ్య పిలుపునిచ్చారు. త్రిపురాంతకం గ్రంథాలయంలో వారోత్సవాల గోడపత్రికను సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.ఝాన్సీ, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, నాగభూషణం, పిచ్చయ్య, ఆదినారాయణరెడ్డి, సురేష్, నాసర్‌వలి, పల్లె కన్నా తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్, తదితరులు

400 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

కొమరోలు(గిద్దలూరు రూరల్): మండలంలోని అల్లినగరం అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీ కోసం అక్రమంగా నిల్వ ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను ఆదివారం సెబ్ సీఐ అరుణ కుమారి తన సిబ్బందితో సహాదాడులు నిర్వహించి నాటుసారా తయారీ బట్టీలను ధ్వంసం చేశారు. అందిన సమాచారం మేరకు అల్లినగరం అటవీప్రాంతంలో కొందరు వ్యక్తులు నాటుసారా తయారీ చేస్తున్నారని తెలుసుకున్న సీఐ తన సిబ్బందితో కలిసి అటవీప్రాంతంలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో వారికి నాటుసారా తయారుచేస్తున్న బట్టీలను గుర్తించి బెల్లం ఊటను ధ్వంసం చేశారు.


బెల్లంబట్టీని ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

పూరి గుడిసె దగ్ధం

- రూ.60 వేల ఆస్తి నష్టం

మార్కాపురం రూరల్: మండలంలోని వేములపేటలో పూరిగుడిసె దగ్ధమై రూ.60 వేల ఆస్తి నష్టం జరిగింది. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖాధికారి ఆర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ఆవులమందకు సుబ్బమ్మకు చెందిన పూరిగుడిసె ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిపోయింది. వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది





డీజీ పేటలో చోరీ

- రూ.1.20 లక్షల నగదు, 50 గ్రాముల బంగారు, 140 గ్రాముల వెండి వస్తువుల అపహరణ

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని డీజీపేట గ్రామంలో చోరీ జరిగింది. ఎస్సై పి.అనిల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు..మండలంలోని డీజీపేటకు చెందిన మితికాల గురునాథం, కాశీశ్వరి దంపతులు కూల్‌డ్రింక్స్ దుకాణం నిర్వహిస్తుండగా ఆదివారం రాత్రి దుకాణం నుంచి ఆలస్యంగా వచ్చి ఇంటి వరండాలో నిద్రించారు. సోమవారం ఉదయం నిద్రలేచి ఇంట్లోకి వెళ్లి చూసేసరికి ఇంటి వెనుకవైపు తలుపు తీసి ఉంది. కాగా బీరువా తెరిచి చూడగా అందులో ఉంచిన 50 గ్రాముల బంగారు ఆభరణాల, 140 గ్రాముల వెండి వస్తువులు, లాకర్‌లో, దుస్తుల కింద దాచి ఉంచిన రూ.1.20 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పామూరు సీఐ కాటూరి శ్రీనివాసరావు, సీఎస్‌పురం ఎస్సై పి.అనిల్‌కుమార్ పరిశీలించారు. ఒంగోలు నుంచి వచ్చిన క్లూస్‌టీం ఆధారాలు సేకరించారు. కాగా లాకర్‌తాళం తీసి నగదు, వస్తువులు తీసుకుపోగా బీరువాలోని వస్తువులు ఎక్కడివక్కడే ఉండటాన్ని బట్టిచూస్తే తెలిసిన వారే చోరీచేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారివెంట వెలిగండ్ల ఎస్సై మహేష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.


బీరువాను పరిశీలిస్తున్న క్లూస్‌టీం, సీఐ, ఎస్సైలు

రోడ్డు ప్రమాదంలో బావబామ్మర్దుల దుర్మరణం

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బావ బామ్మర్దులు దుర్మరణం చెందారు. దీంతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు, బంధువుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం రాజులపాడు గ్రామానికి చెందిన బింగి యోహాన్(31), తన బావమరిది నాగలూరు మహేష్(29) ఇద్దరూ కలసి తాపీమేస్త్రీలుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారు కమలాపురం మండలంలోని నల్లింగాయపల్లెలో నివాసం ఉంటూ.. సమీప గ్రామాల్లో బేల్దారి పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి పనులు పూర్తి కావడం ఆలస్యం కావడంతో ఇంటికి వచ్చారు. ఆ సమయంలో తినడానికి ఏం లేకపోవడంతో పందిళ్లపల్లె వద్ద ఉన్న హోటల్‌కు వెళ్లి భోజనం చేశారు. బైక్‌కు పెట్రోల్ పట్టించుకోవడానికి బంక్‌కు వెళుతూ రోడ్డు దాటుతుండగా.. ఎర్రగుంట్ల వైపు నుంచి కడప వైపు వెళ్లే లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో వారు బైక్‌తో సహా రోడ్డు పక్కనున్న పొదల్లో పడి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్సై హృషికేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా యోహాన్‌కు భార్య విశ్వేశ్వరమ్మ, చిన్న వయస్సు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అలాగే మహేష్‌కు భార్య బుజ్జమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. బుజ్జమ్మ ప్రస్తుతం గర్భిణి


రోడ్డు పక్కన పొదల్లో పడిన మృతదేహాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జరుగుమల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కె.బిట్రగుంట పై ఫ్లైవర్‌పై జరిగింది. వివరాల్లోకి వెళితే..నెల్లూరు జిల్లా కొండాపురం మండలంసాయిపేట గ్రామానికి చెందిన పాలకుర్తి వాసు ఒంగోలులో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. వరుసగా సెలవులు రావడంతో ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో జరుగుమల్లి స్టేషన్ పరిధిలోని కె.బిట్రగుంట ఫ్లైఓవర్ పై నెల్లూరు వైపు పోతుండగా ముందు వెళుతున్న గుర్తు తెలియని వాహనాన్ని వెనుకాల వస్తున్న వాసు బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో వాసు తలకు బలమైన గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎస్సై వి.వెంకటేశ్వరరావు, వారి సిబ్బంది హైవే మొబైల్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు.


వాసు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు